క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తమ కళాశాల విద్యార్థి ఎం.లక్ష్మీనరసింహ ఎంపికై నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాఘురామాచార్యులు తెలిపారు. విద్యార్థిని సోమవారం అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న కర్నూలు స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా హాకీ అండర్ –19 స్కూల్‌గేమ్స్ పోటీల్లో ఎం.లక్ష్మీనరసింహ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన దత్త కూచిపూడి నృత్యకళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. మహాగణపతిం, తాండవనృత్యం, జతిస్వరం, హర హర శంభో, శివ శివ శంకరా, శంభో శంకరా, అయిగిరి నందిని, లింగాష్టకం, శివోహం తదితర గీతాలకు ప్రణిక, పల్లవి, మన్విత, రాగ, ప్రశస్వి, తనూశ్రీ, కీర్తిక తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



కొత్తపల్లి: బదిలీపై వెళ్తున్న ముసలిమడుగు గ్రామ ఎస్సీ కాలనీ ఎంపీపీ (స్పెషల్) స్కూల్ ఉపాధ్యాయుడు నరేష్‌ను సోమవారం విద్యార్థులు, కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు.

వాసవీ క్లబ్ సభ్యుల ఔదార్యం



వాసవీ క్లబ్ సభ్యులకు డబ్బు అందజేస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలోని వాసవీ క్లబ్ సభ్యురాలు నాగేళ్ల భ్రమరాంబ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి తాడిపత్రి వాసవీ క్లబ్ సభ్యులు తమ వంతుగా రూ.11,500 అందజేశారు. నగదును వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ సంజీవరాయ ప్రసాద్, నందనం క్లబ్ ప్రెసిడెంట్ బాదం నాగేంద్ర, క్లబ్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.


మోదీ పర్యటనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మేరీ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అప్పగించిన బాధ్యతలను ప్రతిఒక్కరూ సక్రమంగా నిర్వర్తించి మోదీ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, వెలుగు ఏపీఎం పుల్లయ్య, మండల వ్యవసాయ అధికారి అమీరున్నీసా బేగం పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ మేళాకు 35 మంది హాజరు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలోని డోన్ ఐటీఐలో జరిగిన అప్రెంటిషిప్ మేళాకు జిల్లాలోని ఐటీఐ పూర్తి చేసిన వారు 35 మంది హాజరయ్యారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ధర్మకుమార్ సోమవారం తెలిపారు. అప్రెంటిషిప్ మేళాకు జిల్లాలో మూడు ప్రైవేట్ కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. కర్నూలుకు చెందిన సోలార్ ఎనర్జీ సిస్టం, అగ్రిసోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌ఎస్‌వీ ఆటో గ్యారేజ్ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని 12మందిని ఎంపిక చేసుకున్నారని వెల్లడించారు. అప్రెంటిషిప్ అడ్వైజర్ నాగ కేషాలు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీలో
చంద్రబాబు, లోకేష్‌లదే కీలక పాత్ర

- చిత్తశుద్ధి ఉంటే సీబీఐతో దర్యాప్తు చేయించాలి
- వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్



పటేల్ సెంటర్ నుంచి ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న డాక్టర్ దార సుధీర్, తదితరులు

నందికొట్కూరు: నకిలీ మద్యం తయారీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు మంత్రి లోకేష్ పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం పటేల్ సెంటర్ నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ నినాదాలు చేశారు. ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దార సుధీర్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు నకిలీ మద్యం తయారీ చేసి రాష్ట్రంలో సరఫరా చేసినట్లు ఆధారాలు బయటపడినా సీఎం చంద్రబాబు నోరు మెదపడంలేదన్నారు. నకిలీ మద్యం తాగి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 450 మంది మృతిందారన్నారు. నాణ్యమైన మద్యం అందిస్తామని ఎన్నికల ముందు టీడీపీ నేతలు ఊదరగొట్టి అధికారంలోకి రాగానే నకిలీ మద్యం తయారు చేసి పేదల ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. తండీకొడుకుల కనుసన్నల్లోనే నకిలీ మద్యం తయారీ యథేచ్ఛగా సాగుతుందని, వాస్తవాలను సమాధి చేసేందుకే చంద్రబాబునాయుడు సిట్ దర్యాప్తు కోరారని ఆరోపించారు. కేంద్రం జోక్యం చేసుకుని నకిలీ మద్యం వెనుక ఉన్న టీడీపీ నేతలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ మంత్రిని బర్తరఫ్ చేయాలని, బాధ్యులైన అధికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ మద్యం ముడుపులు అందుకున్న మంత్రి లోకేష్‌పైనా సీబీఐ విచారణకు కేంద్రం ఆదేశించాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పుల్యాల దివ్య, కల్లిమున్నిసాబేగం, యుగంధర్‌రెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, సర్పంచులు స్వామిరెడ్డి, నాగార్జునరెడ్డి. జనార్దన్‌గౌడు, నాగార్జున, ఎంపీటీసీలు హరిస్వరోత్తరెడ్డి, స్వాములు, కౌన్సిలర్లు కృష్ణ,



ఎక్సైజ్ ఎస్‌ఐకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ దార సుధీర్

కల్తీ మద్యందారులను అరెస్ట్ చేయాలి

ఆత్మకూరు: కల్తీ మద్యందారులను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ డిమాండ్ చేశారు. బెల్ట్‌షాపులు, నకిలీ మద్యం విక్రేతలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుడి, బడి తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయన్నారు. మద్యంబాబులు ఘర్షణలకు దిగుతున్నారని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవహిస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు పర్యవేక్షణను గాలికొదలడంతో బెల్ట్‌షాపుల నిర్వాకులు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైందన్నారు. కల్తీ మద్యం తాగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. నకిలీ మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, బెల్ట్‌షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ ఎస్‌ఐ వీరస్వామికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్ మున్నీర్ బాషా, వెంకటస్వామిగౌడ్, రామచంద్రారెడ్డి, శివరామ్, సురేష్, బాలస్వామియాదవ్, విజయ్, రవీంద్ర, ధనుంజయ, భాస్కర్, శ్రీనివాసగౌడ్, సాగర్ పాల్గొన్నారు.



ఎక్సైజ్ ఎస్‌ఐ వీరస్వామికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయబ్, రవూఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు పుల్యాల నాగిరెడ్డి, తిరుమలేశ్వరరెడ్డి, తులసిరెడ్డి, లోకేష్‌రెడ్డి, చంద్రారెడ్డి, హసీనా, యాట ఓబులేసు, రమేష్ నాయుడు, మాధురి, సులోచన, సురేష్‌యాదవ్, ఉపేంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, గౌస్, అశోక్‌రెడ్డి, బ్రహ్మం, మల్లేశ్వరరెడ్డి, రాజు, మాబాషా, రమణ, శివ, అబుబక్కర్, చరణ్, బంగారం, గోపాల్, మల్లయ్య, నానీ, సుమంత్, అక్తర్‌బాషా, ఏసురత్నం, రవి పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటం రూ.3,500ల చొప్పున మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ గోపికృష్ణ, ఏఓ కృష్ణారెడ్డిలకు అందజేశారు. అనంతరం పిక్కిలి వెంకటేశ్వర్లు, కిసాన్‌మహాసభ తాలూకా అధ్యక్షుడు గాబ్రియేల్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలు అధిక వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లలోపే దిగుబడి రావటంతో పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం రూ.2,400ల మద్దతు ధర ప్రకటించినప్పటికీ వ్యాపారులు కుమ్మక్కైరూ.1,900లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సోమప్ప, శ్రీరాములు, మద్దిలేటి, ఎస్‌బీబీ, నరసింహులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



మాట్లాడుతున్న సంఘ్ జిల్లా సరికి ప్రముఖ్ వెంకటమోహన్

పాములపాడు: దేశాన్ని సమైక్యంగా ఉంచడమే ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) లక్ష్యమని సంఘ్ జిల్లా సరికి ప్రముఖ్ వెంకటమోహన్ అన్నారు. స్థానిక చౌడేశ్వరి ఆలయ ఆవరణంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం పొందిన భారతదేశాన్ని ఏవిధంగా కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే 1925 విజయదశమి రోజున ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంధ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో వివేకానంద హై స్కూల్ వ్యవస్థాపకులు ఆర్‌ఎస్‌ఆర్ గోపాల్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార కార్యకర్త మహేష్, బీజేపీ మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో వైద్యులు.. రోగులకు ఇక్కట్లు!

పాములపాడు: ప్రభుత్వ తీరు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం వాతావరణం మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇలాంటి సమయంలోనే పీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట పట్టడం, వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డిప్యుటేషన్‌పై ఆయుర్వేద వైద్యాధికారిణి

స్థానిక ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ సావిత్రిని పగిడ్యాల మండలం ప్రాతకోట వైద్యశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. పీహెచ్‌సీలో వైద్యులు లేరని ఆయుర్వేద వైద్యశాలకు వస్తే ఇక్కడ కూడా డాక్టర్ లేకపోవడంతో చేసేదేమీ లేక రోగులు వెనుదిరిగారు.

శక్తి యాప్‌పై అవగాహన

బండి ఆత్మకూరు: స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు శక్తి యాప్‌పై సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ (1930), చైల్డ్ వెల్ఫేర్ (1098), ఎమర్జెన్సీ కాల్స్ (112), బాల్య వివాహాలు, చైన్‌స్నాచింగ్, ట్రాఫిక్ రూల్స్ తదితర వాటి గురించి విద్యార్థినులకు తెలియజేసి, వన్‌స్టాప్ సెంటర్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ రాఫీ, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నేడు వైఎస్సార్‌సీపీ సంతకాల సేకరణ

బండి ఆత్మకూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం నంద్యాలలోని పద్మావతి నగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణలో మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

రేపు మండల సమావేశం

పగిడ్యాల: ఈనెల 15న ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరవ్వాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్రకుమార్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు హాజరుకానున్న మండల సమావేశంలో అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

మహానందిలో వర్షం

మహానంది: మహానంది మండల పరిధిలో అక్కడక్కడా కొద్దిపాటి వర్షం కురిసింది. పొలాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న ధాన్యం కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. వరుణుడు శాంతించడంతో ఊపిరిపీల్చుకున్నారు.

మోదీ పర్యటనను అడ్డుకుంటాం

పగిడ్యాల: ఈనెల 16న ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనను అడ్డుకుంటామని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ప్రత్యేక హోదా, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధుల హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారన్నారు. 14, 15తేదీలలో పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గో బ్యాక్ నినాదాలతో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉసేనమ్మ, ప్రజా సంఘాల నాయకులు వెంకటేష్, అబ్దుల్లా, ప్రభాకర్, గిద్దయ్య, శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బండి ఆత్మకూరు: కురుస్తున్న వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, రాబోయే మూడు రోజులు తుఫాను ప్రభావం కొనసాగే అవకాశం ఉందని తెలిపారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి



నూతన ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ నాగరాజు

కొత్తపల్లి: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓలు నాగరాజు, ఇనాయతుల్లా నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ఇటీవల అపాయింట్‌మెంట్ ఆర్డర్లు తీసుకున్న 37 మంది నూతన ఉపాధ్యాయులు సోమవారం ఎంఈఓలకు జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు.

- జూపాడుబంగ్లా: మండలానికి 15 మంది నూతన ఉపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు.

శ్రీశైలం ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- ట్రస్ట్‌బోర్డు ప్రమాణస్వీకారానికి అందని ఆహ్వానం?

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి నూతనంగా నియమించిన ధర్మకర్తల సలహా మండలి సభ్యులచే సోమవారం దేవస్థాన అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. అయితే ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి ఆహ్వానం అందలేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన సున్నిపెంటలో ప్రధాని పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ పరిశీలనకు వెళ్లారు. సభ్యుల ప్రమాణస్వీకారానికి ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి హాజరయ్యారు. కానీ స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే బుడ్డా హాజరుకాకపోవడం గమనార్హం. ఇదే సమయంలో శ్రీశైల దేవస్థానంలో ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యే మద్దతుదారులు బండిఆత్మకూరుకు చెందిన చిట్టిబొట్ల భరద్వాజ శర్మ, శ్రీశైలానికి చెందిన చెంచు మహిళ గుర్రా గంగమ్మ సైతం ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండిపోయారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, వైద్యులు శ్రీకాంత్ సూచించారు. సోమవారం ఎల్‌ఐసీ కార్యాలయంలో కర్నూలు ఆర్కా ఆసుపత్రి సీఈఓ శ్రీనివాసతాంబే ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్ మాట్లాడుతూ ఎల్‌ఐసీ సంస్థ పాలసీదారులకు విశేష సేవలు అందిస్తూనే సమాజ సేవలో కూడా ముందుంటుందన్నారు. రాబోయే రోజుల్లో ఎల్‌ఐసీ సేవలను మరింత విస్తృతపరుస్తున్నామన్నారు. ఎల్‌ఐసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్కా ఆసుపత్రి కార్పొరేట్ మేనేజర్ రవికుమార్, ఆర్గనైజర్ వినోద్ పాల్గొన్నారు.

పేరూరులో అగ్ని ప్రమాదం



గాయపడిన మూగజీవాలు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరులో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో పశువుల కొట్టం కాలి బూడిదైంది. ఈ ఘటనలో 15 పశువులు గాయపడ్డాయి. గ్రామస్తులు తెలిపిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నాగశేషు ఆవులు, గేదెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా ఆదివారం రాత్రి పశువులను కొట్టంలో ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున మూగ జీవాల అరుపులకు పక్కనే ఉన్న రైతు నిద్ర లేచి చూడగా కొట్టం నుంచి మంటలు ఎగిసిపడుతుండటం చూసి ఇరుగు పొరుగు వారి సాయంతో మంటలను ఆర్పేందుకు యత్నించారు. ప్రమాదంలో మూగజీవాలు గాయాల పాలయ్యాయి. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ వాటికి గ్రామానికి వెళ్లి వైద్యం చేశారు. విద్యుదాఘాతంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు బాధిత రైతు వాపోయాడు.

మోదీ సభకు 280 బస్సులు

- జిల్లా ప్రయాణికులకు తప్పని కష్టాలు
- మల్లన్న భక్తులకు ఆత్మకూరు నుంచి దోర్నాల వరకే ఆర్టీసీ బస్సులు



ఆత్మకూరులో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆత్మకూరు: మహిళలకు ఉచితమంటూ బస్సు సర్వీసులను తగ్గించడంతో ఇప్పటికే ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీశైలం, కర్నూలు పర్యటనల సందర్భంగా మరింత కష్టాలు వచ్చిపడ్డాయి. జిల్లాలోని 280 బస్సు సర్వీసులను రెగ్యులర్ రూట్లలో రద్దు చేసి మోదీ సభకు ప్రజలను తరలించేందుకు కేటాయించడంతో ప్రయాణికుల కష్టాలు అంతా ఇంతా కాదు. ఇప్పటికే శ్రీశైలం మహాక్షేత్రానికి 20 బస్సు సర్వీసులను రద్దు చేయడంతో ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. వీరిని తరలించేందుకు ఆత్మకూరు ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మోదీ సభకు 600కు పైగా బస్సుల కేటాయింపు

శ్రీశైలం–కర్నూలులో ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో లక్షలాది మందిని తరలించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచి 600కు పైగా ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఇందులో నంద్యాల జిల్లా నుంచి 280 బస్సులను కేటాయించగా, డిపోల వారీగా ఆళ్లగడ్డ నుంచి 42 బస్సులు, ఆత్మకూరు 37, బనగానపల్లె 42, డోన్ 30, కోవెలకుంట్ల 32, నందికొట్కూరు 37, నంద్యాల నుంచి 60 బస్సులను కేటాయించారు. కడప, అనంతపురం జిల్లాలకు చెందిన బస్సులను సైతం కేటాయించడంతో నాలుగు రోజుల పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

శ్రీశైలానికి మొదలైన బస్సుల కొరత...

ఉమ్మడి జిల్లా నుంచి శ్రీశైల మహాక్షేత్రానికి చేరుకునే భక్తులకు సోమవారం నుంచే ఇబ్బందులు మొదలయ్యాయి. స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణానికి మహిళలు పెద్ద సంఖ్యలో శ్రీశైలానికి తరలివెళ్తున్నారు. అల్ట్రా పల్లెవెలుగు, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎక్కి ఆత్మకూరు నుంచి 110 కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలానికి నిల్చొని సైతం బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అయితే ఇప్పటికే కర్నూలు నుంచి శ్రీశైలానికి రావాల్సిన 7 బస్సులతో పాటు నంద్యాల, డోన్ నుంచి బస్సుల కొరత ఏర్పడడంతో శ్రీశైలం వెళ్లే మల్లన్న భక్తులకు కష్టాలు తప్పడం లేదు. కాగా ప్రయాణికుల సౌకర్యార్థం ఆత్మకూరు డిపో అధికారులు దోర్నాల వరకు బస్సు సర్వీసులను నడుపుతున్నారు.

బస్సులే లేవు



శ్రీశైలానికి వెళ్లాలని వచ్చాం. ఇక్కడ బస్సులే లేవు. దోర్నాల వరకే ఉన్నాయంట. సంతోషంతో మల్లన్నను దర్శించుకుందామంటే బస్టాండులోనే బస్సుల కోసం విసుగొచ్చే వరకు ఎదురుచూడాల్సి వచ్చింది. అధికారులు శ్రీశైలం క్షేత్రానికి కావాల్సిన బస్సులను ఏర్పాటు చేయాలి.

– రత్నమ్మ, నంద్యాల పట్టణం

బస్సులు రద్దు చేయడం తగదు



ప్రధాన నేతలు, ఇతర వేడుకలకు ఆర్టీసీ బస్సులను ఉపయోగించడం తగదు. ఇదే అదునుగా తీసుకుని ప్రైవేట్ వాహనదారులు చార్జీల రేట్లు పెంచుతున్నారు. ఆత్మకూరు నుంచి కర్నూలుకు రూ.200 దాకా వసూలు చేస్తున్నారు. శ్రీశైలానికి అయితే ఆత్మకూరు నుంచి రూ.300 నుంచి రూ.400 దాకా తీసుకుంటున్నారు.

– మద్దమ్మ, నంద్యాల పట్టణం

దోర్నాల వరకు నడుపుతాం

ప్రధానమంత్రి పర్యటనకు ఆత్మకూరు నుంచి 37 బస్సులను కేటాయించారు. అయినా ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు బస్సులను నడుపుతాం. ఇక ఉన్నవాటితోనే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆత్మకూరు నుంచి మిగతా రూట్లలో సర్దుబాటు చేస్తాం. – కోటయ్య నాయక్, ఆర్టీసీ సీఐ, ఆత్మకూరు

లారీని ఢీకొన్న కారు

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న తుమ్మలపెంట క్రాస్ రోడ్డులో సోమవారం కారు లారీని ఢీకొనడంతో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్యాపిలి మండలం పోదొడ్డికి చెందిన కృష్ణమూర్తి కొలిమిగుండ్ల నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గమధ్యలోని తుమ్మలపెంట క్రాస్ రోడ్డు వద్దకు చేరగానే కారు టైర్ పేలి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. స్థానికులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పక్కకు తీసి గాయపడిన అతన్ని తాడిపత్రికి తరలించారు.